క్లుప్తంగా

ఆలయాల నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ఐలయ్య

తుర్కయంజాల్: ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలని కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య అన్నారు. పురపాలక సంఘం పరిధి తొర్రూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న బీరప్ప, కామరతి దేవి, మహంకాళీదేవి ఆలయాల నిర్మాణానికి మంగళవారం ఆయన రూ.లక్ష పదహారువేలను విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఐలయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంజయ్య, నవభారత్ కాలనీ, ప్రగతి నగర్, ఇందిరమ్మ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

న్యామతాపూర్‌లో కంటివెలుగు శిబిరం



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. మండల పరిధిలోని న్యామతాపూర్‌లో కంటి వెలుగు వైద్యశిబిరాన్ని మంగళవారం ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాదగిరి, వైద్యులు కిరణ్ కుమార్, సంపూర్ణ, సూపర్‌వైజర్ సుధీర్‌బాబు, కార్యదర్శి జగన్, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

రైతుబీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: కడ్తాల్ మండలం చరికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బోయిన్‌గుట్టతండాకు చెందిన పాత్లవత్ కోంటి అనే రైతు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు రైతు బీమా కింద మంజూరు అయ్యింది. మంగళవారం మండల కేంద్రంలో బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ బీమాకు సంబంధించిన చెక్కును అందజేశారు. సర్పంచ్ భారతమ్మ, ఉపసర్పంచ్ వినోద్, నాయకులు అంజి, కృష్ణ, గోపాల్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ



నోట్‌పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో హరికిషన్, ఉపాధ్యాయులు

యాచారం: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తామని బీజేపీ మండల కార్యదర్శి హరికిషన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన 130 మంది విద్యార్థులకు మంగళవారం సొంత నిధులతో నోటు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మదన్, ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటేశ్, గ్రామస్తులు శ్రీనివాస్, సతీష్, రాజశేఖర్, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఔటర్ సమీపంలో చెత్త



అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని ఔటర్‌రింగ్‌రోడ్డు సమీపంలో విజయవాడ జాతీయ రహదారిపై గత కొన్ని రోజులుగా చెత్త దర్శనమిస్తోంది. సమీపంలోని దుకాణదారులు, బాటసింగారం పండ్ల మార్కెట్‌కు పండ్లు తీసుకువచ్చే వాహనదారులు ఆ చెత్తను తీసుకువచ్చి ఇక్కడ వేస్తుండటంతో కుప్పలుగా మారుతున్నాయి. అంతేకాకుండా చిత్తుకాగితాలు గాల్లోకి ఎగురుతుండటంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి అక్కడి చెత్తను తొలగించడంతో పాటు చెత్త వేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

గ్రంథాలయం స్థాయి పెరిగేనా?

- సొంత భవనానికి నోచుకోని కడ్తాల్ మినీ లైబ్రరీ
- ఒకే గదిలో అరకొర వసతుల నడుమ కొనసాగింపు
- అప్‌గ్రేడ్ చేసి వసతులు కల్పించాలంటున్న పాఠకులు



షటర్‌లో కొనసాగుతున్న గ్రంథాలయం

కడ్తాల్: మండల కేంద్రంలో 1999 సంవత్సరంలో ఏర్పాటు చేసిన మినీ గ్రామీణ గ్రంథాలయయే నేటికీ కొనసాగుతుంది. మండలంగా ఆవిర్భవించి ఏడేళ్లు దాటినా గ్రంథాలయ స్థాయిని పెంచడంతో పాటు సొంత భవనం ఏర్పాటు చేయకపోవడం, సరైన పుస్తకాలు లేకపోవడంపై విద్యార్థులు, నిరుద్యోగులు, పాఠకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కడ్తాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఓ షటర్(గది)లోనే గ్రామీణ గ్రంథాలయం కొనసాగుతుంది. చాలీచాలనీ పుస్తకాలు, ఐదారు దినపత్రికలతో గ్రంథాలయం కొనసాగతుంది. అరకొర వసతులు మధ్య, ఇరుకు గదిలో గ్రంథాలయాన్ని నిర్వహించడంతో పాఠకుల సంఖ్య కూడా పెరగడం లేదు. గ్రంథాలయాన్ని అప్‌గ్రేడ్ చేయడంతో పాటు సొంత భవనం నిర్మించి అన్ని వసతులు కల్పించాలని పాఠకులు కోరుతున్నారు.

మండల కేంద్రంగా అవతరించినా..

మండల కేంద్రంగా అవతరించినా కడ్తాల్‌లో అందుకు తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ప్రత్యేకించి గ్రంథాలయాల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నవలలు, కథల పుస్తకాలు, చరిత్ర, ఆరోగ్య పుస్తకాలతో పాటు, మాసపత్రికలు అందుబాటులో లేకపోవడంతో పుస్తక ప్రియులు నిరాశ చెందుతున్నారు. అదే విధంగా పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులు ప్రత్యేక పుస్తకాలు లేక పోవడంతో ఇబ్బందిపడుతున్నారు.

స్థలం గుర్తించినా..

గ్రంథాలయ భవన నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ పాలకమండలి సభ్యులు మండల కేంద్రంలో పలు స్థలాలను పరిశీలించి స్థలాన్ని ఎంపిక కూడా చేసింది. గ్రామ పంచాయతీ తీర్మానం కూడా చేసి సంబంధిత జిల్లా అధికారులకు నివేదికను అందజేసింది. అయినప్పటికీ ప్రభుత్వ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేదు. త్వరగా నూతన భవన నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇవ్వడంతో పాటు ఆధునిక హంగులతో గ్రంథాలయం నిర్మిస్తే మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల నిరుద్యోగులకు, విద్యార్థులకు, పాఠకులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. స్థానిక నాయకులు, అధికారులు ఆదిశగా చర్యలు తీసుకొని గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించడంతో పాటు అందులో అనఇన వసతులు కల్పించాలని పాఠకులు కోరుతున్నారు.

అప్‌గ్రేడ్ చేయాలి



ప్రస్తుతం మండల కేంద్రంలో కొనసాగుతున్న గ్రామీణ గ్రంథాలయం విద్యార్థుల, నిరుద్యోగుల అవసరాలకు ఏ మాత్రం ఉపయోగపడటంలేదు. నాలుగైదు దినపత్రికలు, మరికొన్ని పుస్తకాలు ఉన్నా పాఠకుల అభిరుచులకు అవి ఏమాత్రం చాలడం లేదు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గ్రంథాలయాల ఆధునీకరణ చేపట్టాలి. గ్రూప్స్ పుస్తాకాలతో పాటు అన్ని కాంపిటేటివ్ పుస్తకాలు అందుబాటులో ఉంచాలి.

– రాజేశ్, నిరుద్యోగి, కడ్తాల్

నూతన భవనం నిర్మిస్తాం



మండల కేంద్రంలో ప్రస్తుతం ఉన్న మినీ గ్రంథాలయాన్ని అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. త్వరలోనే సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. పాఠకుల సంఖ్య, అవసరాలకు అనుగుణంగా ఆధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మించేందుకు కృషి చేస్తాం. అందులో విద్యార్థులకు అవసరమయ్యే అన్ని రకాల పుస్తకాలు ఉంచుతాం.

– దశరథ్‌నాయక్, జెడ్పీటీసీ, కడ్తాల్



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: నిరుపేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయం వద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ వినోద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 87 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పేద ప్రజల కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లి భారం కాకుడదనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. అదేవిధంగా బీసీ కుల వృత్తుల వారికి ప్రభుత్వం రూ.లక్ష సాయం అందిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో గృహలక్ష్మి పథకం కింద 4వేల ఇళ్లు మంజూరయ్యాయని ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3లక్షలు అందజేస్తుందని తెలిపారు. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, సర్పంచ్‌లు తులసీరాంనాయక్, సుగుణ, రవీందర్, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, గోపాల్, మంజుల, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహ, రైతుబంధు మండల కోఆర్డినేటర్ వీరయ్య, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు నర్సింహ, ఉపసర్పంచ్‌లు రామకృష్ణ,వినోద్, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధిపై చర్చకు మేం సిద్ధం

బీఆర్‌ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్ నాయక్

తుర్కయంజాల్: మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్‌నాయక్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన యంజాల్‌లో మాట్లాడుతూ.. అభివృద్ధిపై చర్చకు సంబంధించి ఈనెల 26వ తేదీ వరకు వేచి చూడటం ఎందుకని బుధవారం ఉదయం 10 గంటలకు తుర్కయంజాల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు చైర్‌పర్సన్, ఆమెకు మద్దతిచ్చే కౌన్సిలర్లు ఆధారాలతో సహా చర్చకు రావాలని ప్రతి సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సహకారంతోనే మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. అభివృద్ధి విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ చర్చకు సిద్ధమేనన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



సర్వే నంబర్ 127లోని ఇంటి నిర్మాణాన్ని కూల్చేస్తున్న సిబ్బంది

యాచారం: మొండిగౌరెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 127 ప్రభుత్వ భూమిలోని రెండు అక్రమ ఇంటి నిర్మాణాలను రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 58, 59 జీఓను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు సర్వే నంబర్ 127లో రెండు రేకుల ఇళ్లు నిర్మించుకున్నారు. వాటిని క్రమబద్ధీకరణ చేసుకునేందుకు గాను 2023 మే30 లోపే ఆన్‌లైన్‌లో 58, 59 జీఓ కింద దరఖాస్తు చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు 500–1000 గజాల స్థలాన్ని అక్రమించి 80 గజాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టి మిగితా స్థలంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయితే అవి అక్రమ నిర్మాణాలని పదిహేను రోజుల క్రితమే గ్రామస్తులు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే మంగళవారం ఉదయం తహసీల్దార్ సుచరితకు అక్రమ ఇంటి నిర్మాణాలపై ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ ఆయా నిర్మాణాలను పరిశీలించారు. అవి అక్రమ నిర్మాణాలే అని నిర్ధారించుకున్నాక సీఐ లింగయ్య, ఎస్‌ఐలు గోపాల్, ప్రసాద్, పోలీస్ సిబ్బంది సమక్షంలో సిబ్బందితో కలిసి ఆయా నిర్మాణాలను కూల్చేశారు. అక్రమార్కులు అడ్డుకునే ప్రయత్నం చేసినా సరైనా ఆధారాలు చూపించకపోవడంతో కూల్చివేతలు కొనసాగాయి. అనంతరం పోలీసులు కేసు నమోదు చేశారు.

భగీరథ కనెక్షన్లు ఇవ్వండి

- నీటి సరఫరాను పెంచండి
- విద్యుత్ సమస్యలపై స్పెషల్‌డ్రైవ్ చేపట్టండి
- సభ్యుల డిమాండ్



ఎంపీపీ సుకన్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ జ్యోతి

యాచారం: ఒకవైపు గ్రామాల్లో కొత్త కాలనీలు పుట్టగొడుగుల్లా వెలుస్తుండటంతో జనాభా గణనీయంగా పెరుగుతున్నప్పటికీ మరోవైపు వారికి సరపడా నీటి సరఫరా కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పేర్కొన్నారు. ఎంపీపీ కొప్పు సుకన్య అధ్యక్షతన మంగళవారం యాచారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నానక్‌నగర్ సర్పంచ్ పెద్దయ్య, మంతన్‌గౌరెల్లి, చింతపట్ల, మల్కీజ్‌గూడ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు జ్యోతినాయక్, లక్ష్మమ్మ, శారద తదితరులు మాట్లాడుతూ.. గ్రామాల్లో కొత్త ఇంటి నిర్మాణాలకు మిషన్ భగీరథ కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. మిషన్ భగీరథ వాటర్‌గ్రిడ్ ఏఈఈ అనిరుధ్ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీలో కొత్త కనెక్షన్ల కోసం అర్జీదారుల వివరాలతో కూడిన తీర్మాన ప్రతిని అందజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొత్త కనెక్షన్లు ఇచ్చేలా కృషిచేస్తామని తెలిపారు.

సమస్యలపై సభ్యుల ఏకరువు..

మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద చేతికందే ఎత్తులోనే ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని వెంటనే వాటిని సరిచేయాలని సభ్యులు కోరారు. వడగళ్లు కురిసి మండలంలోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో వరి, కూరగాయలు, పండ్లతోటలు తీవ్రంగా నష్టపోయాయని.. మంతన్‌గౌరెల్లి గ్రామంలో వడగళ్లు కురిసి 600కు పైగా రేకుల ఇళ్లు రంధ్రాలు పడి ధ్వంసమయ్యాయని పరిహారం చెల్లించే విషయంలో జాప్యం పట్ల మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతి నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఎంపీపీ కొప్పు సుకన్యకు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయాలు జరుపుతున్నారని, వ్యాపారులు రశీదులు లేకుండానే రైతులకు విత్తనాలు విక్రయిస్తున్నారని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాలకు సర్కార్ నుంచి నిధులు రాలేదని అప్పులు చేసి వేడుకలు నిర్వహించామని తెలిపారు. సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఎంపీపీ సుకన్య ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు. విత్తనాలు, ఎరువుల సరఫరాలో రైతులకు ఇబ్బందులు రాని వ్వొద్దని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ జంగమ్మ, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ సుచరిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

మంచాల: మంచాల మండలంలోని పలు గ్రామాల్లో గ్రంథాలయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. లోయపల్లిలో ఎంపీపీ నర్మద, చిత్తాపూర్ గ్రామంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య వేడుకల్లో పాల్గొన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు నాగరాజ్, సుకన్య, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పుస్తకాలనే స్నేహితులుగా భావించాలి..

యాచారం: పుస్తకాలనే స్నేహితులుగా భావించి జ్ఞానం పెంచుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. కొత్తపల్లి గ్రామంలో మంగళవారం ఆమె గ్రంథాలయాన్ని ప్రారంభించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, సర్పంచ్ హబీబుద్దీన్, ఎంపీటీసీ సభ్యురాలు సుమతమ్మ, ఉపసర్పంచ్ జగన్, వార్డుసభ్యులు శ్రీనివాస్‌గౌడ్, రమేష్, కోఆప్షన్ సభ్యుడు గుండాలు, సత్తయ్య పాల్గొన్నారు.



యాచారం: పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంపీపీ

రేపు సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ మంగవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కృపేశ్ అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

డిజిటల్ తరగతులు ప్రారంభం

తుర్కయంజాల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పురపాలక సంఘం పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాగన్నగూడలోని ప్రభుత్వ పాఠశాలలో కౌన్సిలర్లు మర్రి మాధవి, మేతరి అనురాధ హాజరై విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాల పంపిణీతో పాటు డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేతరి దర్శన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహిస్తాం



విద్యార్థులను సత్కరిస్తున్న చంద్రశేఖర్, రామ్మోహన్

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తామని క్లాస్‌మెట్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆమనగల్లు వాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి వీరబొమ్మ రామ్మోహన్ చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం క్లాస్‌మెట్ క్లబ్ మరియు వాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆమనగల్లు, కడ్తాల మండలాలల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివి పదోతరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెడల్ బహూకరించి రూ.1,116 నగదు బహుమతి అందించారు. స్థానిక నాయకులు శ్రీనివాస్, క్లాస్‌మెట్ క్లబ్ కోఆర్డినేటర్ భార్గవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి..

యాచారం: విద్యార్థులు పోటీతత్వంతో కష్టపడి చదవాలని చింతపట్ల ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ సూచించారు. చింతపట్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి గ్రేడ్లు సాధించిన విద్యార్థులను మంగళవారం ఆమె సన్మానించారు. ఈ కార్యక్రమంలో చింతపట్ల సర్పంచ్ లిక్కి సరిత, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ భిక్షపతి, వైస్ చైర్మన్ జ్యోతి, పాఠశాల హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రవస్తి చదువుకు అండగా ఉంటాం

ఉప్పల ట్రస్టు చైర్మన్ వెంకటేశ్


తలకొండపల్లి: నిరుపేద ఆడపిల్లల చదువులకు ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందిస్తున్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన చర్ల మధుసూదన్‌రెడ్డి, సునీత దంపతుల కూతురు ప్రవస్తి హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ పబ్లిక్ స్కూల్లో 9వ తరగతి చదువుతుంది. మధుసూదన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో పెద్దదిక్కు కోల్పోయిన ఆ కుటుంబం కూతురి చదువు ఖర్చుల కోసం ఉపసర్పంచ్ అజీజ్ సహకారంతో జెడ్పీటీసీని కలిసి తమ అమ్మాయిని చదివించాలని కోరింది. స్పందించిన జెడ్పీటీసీ మంగళవారం ట్రస్టుద్వారా రూ.25వేలు అందించారు. భవిష్యత్‌లో ప్రవస్తి ఉన్నత విద్యకు సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ఎంపీటీసీ అంబాజీ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



తలకొండపల్లి: పుస్తకాలు పంపిణీ చేస్తున్న కేశవరెడ్డి తదితరులు



హయత్‌నగర్: ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు స్వీకరిస్తున్న జ్యోత్స్న ప్రభ

చదువుతోనే మార్పు సాధ్యం

చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమని ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్ స్పష్టం చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలోని పట్టణాలు, గ్రామాల్లో విద్యా దినోత్సవం నిర్వహించారు. విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రామాలను వివరించారు. విద్యారంగలో విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు. చదువులో రాణించిన విద్యార్థులను సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



మంచాల: విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



ఆమనగల్లు: డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న చైర్మన్ రాంపాల్‌నాయక్



తలకొండపల్లి: పీఈటీ మల్లేశ్‌ను సన్మానిస్తున్న మంత్రి సబితారెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థులతో కలిసి ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

గ్రామకంఠం భూమిని కాపాడండి

ఎమ్మెల్యేకు ఆర్కపల్లి గ్రామస్తుల వినతి

ఆమనగల్లు: మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామంలో గ్రామకంఠం భూములను ఆక్రమించుకున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆర్కపల్లి గ్రామ సర్పంచ్ జంగయ్య, గ్రామస్తులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కోరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను వారు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆర్కపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని సర్వే నం 95, 239, 240, 288, 413, 414లో గ్రామకంఠం భూములు ఉన్నాయని.. కొంతమంది ఆక్రమణదారులు అధికారుల అండతో గ్రామకంఠం భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. గ్రామకంఠం భూమిలో దాదాపు 50 సంవత్సరాల నుంచి ఇండ్లు, ఇండ్ల పట్టాలు ఉన్నాయని ఇప్పుడు భూ మాఫియాదారులు వచ్చి ఆ భూమి తమదంటూ తమపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. గ్రామకంఠం భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ రాజవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్, స్థానిక నాయకులు దండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల దందా

ఇబ్రహీంపట్నంలో ఎస్ఎఫ్ఐ నేతల ఆందోళన

ఇబ్రహీంపట్నం: ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయాన్ని నిరసిస్తూ ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ స్కూల్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా పాఠ్య, నోట్‌పుస్తకాలకు రేట్లు పెట్టి దందా చేస్తున్నారని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు దందాలు చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు ఆందోళన చేస్తున్నవారికి నచ్చజెప్పినప్పటికీ వినకపోవడంతో వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ సంఘం నాయకులు తరంగ్, శ్రీకాంత్, లక్ష్మణ్, వర్షిత్, విక్రమ్, రాకేష్, మహేశ్ పాల్గొన్నారు.